క్లుప్తంగా

రేపు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

యాలాల: మహా శివరాత్రి సందర్భంగా మండల పరిధి జుంటుపల్లి రామస్వామి దేవస్థానంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 7వ తేదీన ధ్వజారోహణం, వాహన సేవ, 8న ఉదయం 5 గంటల నుంచి రుద్రాభిషేకం, 9 గంటల నుంచి రుద్రహోమం, సాయంత్రం 6 గంటలకు పార్వతీ పరమేశ్వరుల దివ్యలీల కల్యాణ మహోత్సవ ఘట్టం జరగనుందని పేర్కొన్నారు.

పాదయాత్రగా శ్రీశైలానికి..


కాలినడకన వెళ్తున్న భక్తులు

బొంరాస్‌పేట: పరమశివుడి దర్శనం కోసం రేగడిమైలారం, వడిచర్ల, నాందార్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన శివభక్తులు పాదయాత్రగా మంగళవారం శ్రీశైలం బయలు దేరారు. వీరిలో సర్వేయర్ ఆవుటి మల్లేశ్, వార్డు మాజీ సభ్యుడు వీరప్ప తదితరులు ఉన్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన


బాలమ్మకుంటలో పనిచేస్తున్న కూలీలు

ధారూరు: మండల పరిధి అల్లాపూర్ గ్రామంలో ఎస్ఆర్ఈజీఎస్ పనులను మంగళవారం ఎంపీడీఓ నర్సింహులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బాలమ్మకుంటలో మట్టి, పూడికతీత పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడగా.. గతేడాది పనులు సక్రమంగా చేసినా.. డబ్బులు తక్కువ వేశారని, ఈ సారైనా దినసరి కూలి మొత్తం వేయాలని కూలీలు ఎంపీడీఓను కోరారు. రోజుకు ఎంతమంది పనిచేస్తున్నారని, ఏఏ పనుల్లో వీరిని తీసుకుంటున్నారని ఏపీఓ సురేష్‌ను ఎంపీడీఓ అడిగి తెలుసుకున్నారు. బాలమ్మకుంటకు చేయాల్సిన మరమ్మతులు, కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తామని ఎంపీడీఓ రైతులకు చెప్పారు. కుంటలోని మట్టి పంట పొలాలకు సేంద్రియ ఎరువులా పనిచేస్తుందని వివరించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ అరవింద్

మోమిన్‌పేట: పోగొట్టుకొన్న ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు కనుగొని, బాధితుడికి అప్పగించారు. మోమిన్‌పేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇటీవల తమ ఫోన్లను పోగొట్టుకొని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌తో ఫోన్‌ను ట్రాకింగ్ చేసి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మంగళవారం వారికి ఎస్ఐ అరవింద్ అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. స్మార్ట్‌ఫోన్లను పోగొట్టుకున్నవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

చుక్కల మందుకు.. చక్కటి స్పందన


కార్మికుల పిల్లలకు పోలియో డ్రాప్స్ వేస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: పోలియో వ్యాధి నిర్మూలనకు చేపట్టిన చుక్కల మందు పంపిణీ కార్యక్రమానికి చక్కటి స్పందన వచ్చిందని వైద్యురాలు మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్ర ప్రకాష్ అన్నారు. మంగళవారం మండల పరిధి ఘండిచెరువు ప్రాంతం ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

కుల్కచర్ల: బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారబోయొద్దని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను, ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్తులు ఎవరూ కూడా చెత్తను బయట వేయవద్దని, డబ్బాలో వేసి, చెత్త సేకరణకు వచ్చే జీపీ సిబ్బందికి అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే.. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'డబుల్' లేట్

- మూడేళ్లయినా ముందుకు సాగని డబుల్ ఇళ్ల నిర్మాణం పనులు
- గూడు కోసం పేదోడి ఎదురుచూపు
- ఇంకెన్నాళ్లంటూ నిట్టూర్పు

పేదోడి సొంతింటి కల.. కలగానే మిగిలిపోతోంది. సర్కారు ఇస్తామన్న డబుల్ బెడ్రూం కోసం కళ్లు కాయలు కాసేలా లబ్ధిదారులు ఎదురు చూసినా.. చివరకు నిరాశే మిగిలింది. ఆర్భాటంగా మూడేళ్ల క్రితం ఇళ్ల నిర్మాణం పనులు మొదలు పెట్టినప్పటికీ.. అవి పిల్లర్లకే పరిమితం అయ్యాయి.


పూడూరులో పిల్లర్లకే పరిమితమైన డబుల్ బెడ్ రూంలు

పూడూరు: మండలంలో 50 రెండు పడక గదుల ఇళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణం కోసం పూడూరు, మన్నెగుడ, మీర్జాపూర్ గ్రామాల్లో స్థలాలను గుర్తించారు. పూడూరులో శ్మశానవాటిక పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సంబంధిత అధికారులు కేటాయించారు. మూడేళ్ల క్రితం ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి, నిర్మాణ పనులు ప్రారంభించారు. తొలి నాళ్లలో పనులు చురుగ్గా సాగినా.. క్రమంగా నెమ్మదించి, అర్ధంతరంగా అసంపూర్తిగా నిలిచిపోయి దర్శనమిస్తున్నాయి.

చేతులెత్తేసిన నిర్మాణదారుడు

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల లబ్ధిదారుల కోసం 3,873 ఇళ్లు మంజూరయ్యాయి. మండలాల వారీగా ఇళ్లను కేటాయించి, సర్కారు స్థలం ఉన్న చోట ప్రభుత్వం నిర్మాణాలను చేపట్టింది. ఈ ఇళ్ల నిర్మాణాలను సగానికి పైగా రోడ్లు భవనాల శాఖకు అప్పగించగా, మరి కొన్ని ఇరిగేషన్ శాఖకు, మున్సిపాలిటీలకు నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. పరిగి నియోజకవర్గం పూడూరు మండల కేంద్రంలో 50 ఇళ్ల కోసం పనులు మొదలు పెట్టి, బేస్‌మెంట్, పిల్లర్ల వరకే నిర్మాణాలు చేపట్టి కంట్రాక్టర్ చేతులెత్తేశారు. కారణం ఏదైనప్పటికీ.. డబుల్ ఇళ్లకోసం ఎంతో ఆశగా ఎదురు చూసిన లబ్ధిదారులకు.. ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో నిరాశ చెందారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణ పనులు.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అయినా పూర్తిచేసి, సొంతింటి కల నెరవేరుస్తుందా అని ఎదురు చూస్తున్నారు. గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల మాదిరిగా, డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని కోరుతున్నారు.

నిర్మాణ పూర్తయ్యేలా చర్యలు..

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం. సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. పూడూరులో పిల్లర్ల వరకు చేసిన పనులకు సంబంధించి బిల్లులు వచ్చాయి. పరిగిలో చేసిన పనులకు బిల్లులు రాలేవని నిర్మాణ పనులు ఆపేశారు. పరిగి, పూడూరులో ఒకరే నిర్మాణదారుడు. త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

– మహేశ్, ఆర్అండ్‌బీ ఏఈఈ

'మా ఊరి సమస్యలు పరిష్కరించండి'

ఎమ్మెల్యేను కోరిన నారాయణపూర్ వాసులు


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో మాట్లాడుతున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: 'మా ఊర్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి' అని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని నారాయణపూర్ గ్రామస్తులు కోరారు. మంగళవారం తాండూరు పట్టణంలో క్యాంప్ కార్యాలయంలో బీఎమ్మార్‌ను గ్రామస్తులు కలిశారు. సమస్యల గురించి వివరించారు. చెన్‌గేస్‌పూర్ శివారు పొలాల నుంచి ఫీర్‌పకీర్ సాబ్ దర్గా వరకు రోడ్డు వేయించాలని కోరారు. పాత తాండూరు నుంచి నారాయణపూర్ వేళ్లే మార్గంలో రోడ్డుపై మురుగు పారుతుందని, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి, సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రామస్వామి దేవాలయం వద్ద సీసీరోడ్డును మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని గ్రామస్తులకు హామీఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు ఉప్పరి విశ్వనాథ్(రాజు), నాయకులు నర్సింహులు, బాల్‌రెడ్డి, బిచ్చన్న, వెంకటప్ప, అంజిలప్ప ఉన్నారు.

ఆశాజనకంగా వాము ధర

మర్పల్లి: వ్యవసాయ మార్కెట్‌లో వాముకు మద్దతు ధర లభించింది. క్వింటా మొదటి రకానికి రూ.18,800, రెండో రకానికి రూ.17 వేల వరకు పలికిందని కమీషన్ ఏజెంట్లు తెలిపారు. కందులు మొదటి రకం క్వింటాకు రూ.10,600, రెండో రకానికి రూ.10,400 పలికిందని తెలిపారు.

నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్


బాధితురాలికి నగదు అందజేస్తున్న వనజ

దౌల్తాబాద్: మండల కేంద్రంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వనజ.. హైదరాబాద్‌లో పరీక్ష రాసి తిరిగి బస్సులో ఠాణాకు వస్తోంది. ఈ క్రమంలో మద్దూరు మండలం దామంగపూర్ గ్రామానికి చెందిన వడ్డె రాములమ్మ, తన చేతిసంచిని బస్సులో మర్చిపోయింది. ఇది గమనించిన వనజ.. సంచిని పరిశీలించగా.. అందులో రూ.4,545లతో పాటు ఆధార్ కార్డు ఉంది. కార్డులోని ఫోన్ నంబరు సహాయంతో సదరు మహిళ వివరాలను కొనుగొని, ఆమెకు నగదుతో ఉన్న సంచిని అందజేసింది. దీంతో పలువురు కానిస్టేబుల్ నిజాయితీని చూసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీశైలం కానిస్టేబుల్‌ను అభినందించారు.

మూడేళ్లయినా మరమ్మతులు లేవు


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వార్డు ప్రజలు

పైప్‌లైన్ సమస్య పరిష్కరించాలంటూ వినతి

తాండూరు టౌన్: పగిలిన తాగునీటి పైపులైన్‌ను మరమ్మతు చేయించాలని పాత తాండూరు 14వ వార్డు ప్రజలు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. పైప్‌లైన్ గురించి మూడేళ్లుగా పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. పైపులైన్ లీకేజీతో కాగ్నానదికి వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా బురదమయంగా మారిందని, దీని వలన వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఇందులో ఎండీ షఫీ, జావెద్ అహ్మద్, షౌకత్ అలీ, ఆబేద్, ఖురేషి, ఇక్బాల్, ఫయాజ్, ముజాహిద్, నవీన్ తదితరులు ఉన్నారు.

మత్స్యసహకార కార్యవర్గం ఎన్నిక


నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి శ్రీకాంత్‌రెడ్డి

దోమ: మత్స్యసహకార సంఘం ఐనాపూర్ చైర్మన్‌గా బోయిని నర్సింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘం సభ్యులతో కలిసి మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం నూతన చైర్మన్‌కు ఎన్నికల అధికారి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నర్సింహులు మాట్లాడారు. మత్స్యకారుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సభ్యులకు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు రాములు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

తాండూరు టౌన్: జమియత్ ఉలేమా అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఇందిరాచౌక్‌లో జమియత్ ఉలేమా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఉలేమా అందిస్తున్న సేవలకు తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య

షాద్‌నగర్: పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని శ్రీ కాకతీయ పాఠశాలలో ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాబయ్య హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. దీంతో ఎలాంటి వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. చిన్నారులు జంక్‌ఫుడ్‌కు అలవాటు పడొద్దని సూచించారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఆహారపు అలవాట్ల గురించి ఉపాధ్యాయులు చెప్పడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతిరెడ్డి, వంశీకృష్ణ, మురళీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎండుమిర్చి ధర పైపైకి



పెద్దేముల్: ఎండుమిర్చి ధర భగ్గుమంటోంది. ప్రస్తుతం మార్కెట్లో కిలోకు రూ.220 నుంచి రూ.250 వరకు పలుకుతోంది. అందులో సన్న మిర్చికి డిమాండ్ ఎక్కువగా ఉంది. మామిడి, ఆల్లం పచ్చళ్లకు వినియోగించడానికి, రోజు వారి అవసరాలకు.. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు చాలా మంది ఏడాదికి సరిపోను మిర్చిని కొనుగోలు చేసి, భద్రపరుస్తుంటారు. గతంలో రూ.160 నుంచి రూ.180 వరకు ఉన్న ధర.. ఈ ఏడాది ప్రారంభంలోనే రూ. 250వరకు ఎగబాకింది. దీంతో మిర్చిని కొనుగోలు చేయాలంటే గృహిణులు ఆలోచిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన వారాంతపు సంతలో వ్యాపారులు మిర్చీని పైన పేర్కొన్న ధరకు విక్రయించడం గమనార్హం.

ఇంటింటికీ రాములోరి ప్రసాదం


ప్రసాదం పంపిణీ చేస్తున్న నాయకులు

కుల్కచర్ల: అయోధ్య రాముల వారి ప్రసాదాన్ని హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, బీజేపీ నేతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. మంగళవారం రాంసింగ్ నాయక్ తండాలో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తుందని, అందులో భాగంగానే అయోధ్యలో ఆలయాన్ని నిర్మించిందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రసాదం పంచిపెట్టడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ నాయక్, హన్మంతు, వినోద్, సంజ్య, రాహుల్, వెంకటేశ్, దశరత్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి పల్లకీ సేవ


స్వామివారి పల్లకిని మోస్తున్న భక్తులు

దోమ: ఆంజనేయ స్వామికి శివ భక్తులు పల్లకీ సేవ చేశారు. మంగళవారం మండల పరిధి గొడుగోనిపల్లిలో శివ భక్తులు కొందరు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆరాధన, అభిషేకంతో పాటు చంద్రం అలంకరణ, పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ధరణి దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

కుల్కచర్ల: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన కొరకు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలని తహసీల్దార్ ప్రభులు అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో తహసీల్ కార్యాలయంలో పలు దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. భూ సంబంధిత అంశాలపై ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులు.. తమ అర్జీలను, వాటి సంబంధించిన ధృవపత్రాలతో తహసీల్ కార్యాలయంలో తమను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం ఈ నెల 9వ తేది వరకు ఉంటుందని, ప్రజలు దీనిని వినియోగించుకోవాలని కోరారు. ఇందులో గిర్దావరి వెంకట గిరి, సీనియర్ అసిస్టెంట్ లింగయ్య, స్థానిక రెవెన్యూ సిబ్బంది జగన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్


కూలీలతో మాట్లాడుతున్న శ్రీనునాయక్

షాద్‌నగర్: ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చిల్కమర్రిలో ఉపాధిహామీ పని చేస్తున్న ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. కాయకష్టం చేస్తున్న కూలీలకు ప్రభుత్వం నెలనెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెక్కాడితే కాని డొక్కాడని కూలీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఉపాధి కూలీలకు ప్రతివారం పేస్లిప్పులు ఇవ్వాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ఎండాకాలం ప్రారంభం కావడంతో నీడ కోసం టెంట్లు, నీరు ఏర్పాటు చేయాలని సూచించారు. కొలతలు లేకుండా కూలీలకు రోజు రూ.800లు చెల్లించాలని, దరఖాస్తు చేసుకున్న కూలీలందరికీ ప్రభుత్వం పని కల్పించాలన్నారు. పని ప్రదేశంలో ఫోటోలు తీసే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేఖర్, యాదయ్య, మల్లయ్య, బాలమణి, చెన్నయ్య, శివకుమార్, నర్సమ్మ, రాజు, బాలమ్మ, కృష్ణమ్మ, వీరమ్మ, బాలమణి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్ల పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీ

తాండూరు రూరల్: జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీ అయిన కరన్‌కోట్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్‌లు అన్నారు. మంగళవారం గ్రామంలో ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.30 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో పదివేల మంది జనాభా ఉందని, కర్ణాటక సరిహద్దులో గ్రామం ఉండటంతో అభివృద్ధికి దూరంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. మోమిన్‌గల్లి నుంచి వడ్డెరగల్లి వరకు రూ.10 లక్షలు, నర్సప్ప ఇంటి నుంచి ఓగిపూర్ అప్రోచ్ రోడ్డు వరకు రూ.10 లక్షలు, ఎస్సీ కాలనీలో మారెమ్మ వీధిలో రూ.5 లక్షలు, మహబూబ్‌సాబ్ దర్గా వద్ద రూ.5 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శరణు బసప్ప, మాణెప్ప, బసప్ప, సుధాకర్, రాములు, యూసుబ్, సునీల్, వెంకట్, అంజిలప్ప, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ


కార్మికులకు గుర్తింపుకార్డులు అందజేస్తున్న ఎంపీటీసీ

తాండూరు రూరల్: నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు గౌతపూర్ గ్రామం పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీటీసీ పట్లోళ్ల నరేందర్ రెడ్డి గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడారు. తాండూరు ప్రాంతంలోని నాపరాతి గనులు, పాలిషింగ్ యూనిట్‌లలో వందల సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నారని, వారి సంక్షేమం కోసం బీఓసీడబ్ల్యూ కార్డులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్డులు శ్రామికులకు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రమాదవశాత్తు కార్మికులు ఎవరైనా మరణిస్తే.. వారి కుటుంబానికి బీమా డబ్బులు వస్తాయని పేర్కొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

అనంతగిరి: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతి రెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ విజయంలో సోషల్ మీడియా పాత్ర కీలకమన్నారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి, ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీనివాస్ ముదిరాజు, వార్డు, గ్రామ, మండల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నాలా, నక్షబాటను కాపాడండి

శంకర్‌పల్లి: మహాలింగపురంలోని నాలా, నక్షబాటను కబ్జా చెర నుంచి కాపాడాలని మహాలింపురం మాజీ ఉప సర్పంచ్ చంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లి–వికారాబాద్ ప్రధాన రోడ్డులోని లక్ష్మారెడ్డిగూడ గ్రామ శివారుల నుంచి మహాలింగపురం గ్రామ శివారు వరకు 33 అడుగుల నక్షబాటతో పాటు వరద నీరు వెళ్లే నాలా ఉండేదని తెలిపారు. గ్రామానికి చెందిన కొంతమంది అక్రమార్కులతో పాటు నగరానికి చెందిన స్థిరాస్తి వ్యాపారులు నక్షబాటతో పాటు కాలువను కబ్జా చేసి, ప్రీకాస్ట్‌తో పాటు ప్రహరీల నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. రాజకీయ నాయకుల అండదండలతో ఏకంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారని వాపోయారు. ఇదే విషయమై గతంలో శంకర్‌పల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పేచీ లేకుండా.. మోరీ పూడికతీత


జేసీబీతో మురుగుకాల్వ పూడిక తీయిస్తున్న జీపీ కార్యదర్శులు

కుల్కచర్ల: చాలాకాలంగా పేరుకుపోయిన మురుగు సమస్యను ఇరు పంచాయతీల కార్యదర్శులు పరిష్కరించారు. చౌడాపూర్ మండల కేంద్రంలోని చౌడాపూర్–మందిపల్ గ్రామ శివారులో ఉన్న మురుగుకాల్వ రెండు గ్రామాలకు మధ్యలో ఉంది. దీంతో ఈ కాల్వ పరిరక్షణ మీదంటే మీదేనంటూ ఇరు గ్రామాల పంచాయతీలు పేచీ పెట్టుకుంటూ వచ్చాయి. ఈ కారణంగా కాల్వ పరి శుభ్రతకు నోచుకోక.. చెత్తాచెదారం పేరుకుపోయి, ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచిపోయింది. అపరిశుభ్రతకు నిలయంగా మారింది. తాజాగా మంగళవారం ఆ జీపీల కార్యదర్శులు రాజిరెడ్డి, స్వరూపలు సమన్వయంతో మురుగు కాల్వ పూడిక తీయించి, మురుగు నీరు ముందుకు సాగేలా చేయించారు. ప్రత్యేకాధికారుల పాలనలో మురుగు సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు.